క్లుప్తంగా

దివ్యాంగులకు 7న వైద్య శిబిరం

అమలాపురం టౌన్: దివ్యాంగుల సంక్షేమం కోసం అమలాపురం పట్టణం ఈదరపల్లి వంతెన దిగువన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఉపకరణాలు పంపిణీకి గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మంగళవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ శిబిరం జరుగుతుందని వివరించారు. దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, చంక కర్రలు, చెవిటి, వినికిడి మెషీన్లు తదితర పరికరాలను అర్హులైన వారికి అందజేస్తామన్నారు. దివ్యాంగులు తమ ఆధార్ కార్డు, సదరమ్ ధ్రువీకరణ పత్రం, ఫొటో, యూహెచ్ఐడీ కార్డు తీసుకుని రావాలని కమిషనర్ రాజు సూచించారు.

నేటితో ముగియనున్న ఎమ్మెల్సీ ఓటు నమోదు

అల్లవరం: మార్చి 6న జరగనున్న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటు నమోదు బుధవారంతో ముగియనుందని తహసీల్దార్ నరసింహరావు మంగళవారం తెలిపారు. అక్టోబర్ 2021 ముందు గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన అభ్యర్థులు ఎమ్మెల్సీ ఓటుకి అర్హులని తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, ఆన్‌లైన్‌లో గాని, ఫారమ్-18ని పూర్తి చేసి స్థానిక వీఆర్వోకి అందించాలన్నారు. ఎమ్మెల్సీ ఓటుకి ఆధార్, ఓటు గుర్తింపు కార్డు, విద్యార్హత జిరాక్సులపై గెజిటెడ్ అధికారి సంతకం చేసి సమర్పించాలన్నారు.

వేతన బకాయిల విడుదల

యానాం: విద్యా శాఖలో యానాం మల్టీపర్పస్ సర్వీస్ ప్రొవైడర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా పని చేస్తున్న 20 మంది అవుట్‌సోర్సింగ్ క్యాజువల్ లేబర్‌కు పెండింగ్ వేతనాలకు సంబంధించి జీఓ విడుదలైనట్లు మంగళవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు ఎల్జీ ఆమోదంతో వేతన బకాయిల మొత్తం రూ.51,88,147ను విడుదల చేస్తూ ఉత్తర్వులు వచ్చాయని చెప్పారు. మల్లాడికి అవుట్‌సోర్సింగ్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం



విరాళం అందించిన దంపతులకు స్వామి చిత్రపటాన్ని అందజేసిన ఆలయ అధికారులు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వర స్వామి నిత్యాన్నదాన ట్రస్ట్‌కి మంగళవారం మురమళ్ల గ్రామానికి చెందిన గోకవరపు సూర్యనారాయణ, సత్యనాగఫణి దంపతులు రూ.10116 విరాళాన్ని ఈవోకి అందజేశారు. దాతను ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు. తొలుత వీరికి ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు ప్రత్యేక దర్శనం అందించి అనంతరం ఆలయ మర్యాదలతో శేషవస్త్రం, స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణధికారి కలారి శ్రీనివాసరాజు, గోకవరపు మల్లిబాబు ఉన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఉప్పలగుప్తం: ప్రజలకు సీజనల్ అంటు వ్యాధులు సోకకుండా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ సిబ్బందికి సూచించారు. గొల్లవిల్లి గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం ప్రత్యేకంగా ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, సలాది నాగరాజు, జొన్నాడ చిన్ని, మంచెం బాలకృష్ణ, కడలి శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలపై శ్రద్ధ చూపాలి

ఉప్పలగుప్తం: అంగన్‌వాడీ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు సూచించారు. మునిపల్లి పంచాయతీ పరిధి కోటిగట్టు అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. పిల్లలు హాజరు తనిఖీ చేసి అంగన్‌వాడీ కార్యకర్త డి.నాగలక్ష్మికి పలు సూచనలు చేశారు. పిల్లలు, గర్భిణులు తరచూ కేంద్రానికి వచ్చి పౌష్టికాహారాన్ని తీసుకునే కృషి చేయాలన్నారు.

భక్తులకు నాగేంద్రుడు సాక్షాత్కారం



పాముల పుట్ట వద్ద గుడ్డుని తీసుకున్న నాగుపాము

అల్లవరం: నాగులచవితి పురస్కరించుకుని సుబ్రహ్మణ్యస్వామి వారిని భక్తి శ్రద్ధలతో కొలిచిన భక్తులకు నాగేంద్రుడు సాక్షాత్కారించిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని దేవర్లంక గ్రామంలో స్థానికులు పుట్టకు పూజలు చేసి, నువ్వుల చిమిడి, గుడ్లు, పాలు, తేగలను పలహారంగా సుబ్రహ్మణ్యం స్వామి వారికి నైవేద్యంగా సమర్పించారు. అయితే భక్తులు సమర్పించిన నైవేద్యాలను భారీ నాగుపాము పుట్ట వద్దకు వచ్చి భక్తులు ఉంచిన గుడ్డుని తీసుకుంది. దీనిని భక్తులు ఆసక్తితో తిలకించారు. సాక్షాత్తు సుబ్రహ్మణ్యస్వామి వచ్చినట్ట భక్తులు విశ్వసించారు.

పరాయి పంచన గ్రంథాలయాలు

- అద్దె భవనంలో కార్యకలాపాలు
- అరకొర వసతులతో పాఠకుల ఇక్కట్లు
- వేధిస్తున్న సిబ్బంది కొరత



అద్దె భవనంలో కొనసాగుతున్న ముమ్మిడివరం ఉప గ్రంథాలయం

ముమ్మిడివరం: ప్రజలకు విజ్ఞానాన్ని, సమాచారాన్ని అందించే గ్రంథాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. అద్దె భవనాల్లో అరకొర వసతులతో పాఠకులు ఇక్కట్లకు గురవుతున్నారు. ముమ్మిడివరంలో ఉన్న జిల్లా ఉప గ్రంథాలయాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఐదు దశాబ్దాల కింద నెలకొన్న సమస్యలు ఇప్పటికీ తీరలేదు. ఈ గ్రంథాలయానికి నేటికి పక్కా భవనం లేక పరాయి పంచన కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు.

ఇదీ సంగతి

1959 సంవత్సరంలో ఈ గ్రంథాలయం ఏర్పడింది. గ్రంథాలయంలో 18 వేల పురాణ పుస్తకాలతో పాటు ప్రముఖ కవులు, రచయితల సాహిత్యం, పుస్తకాలు ఉన్నాయి. అలాగే ఏడాదికి రూ.90 వేలు నుంచి ఒక లక్ష వరకూ వ్యయంతో వివిధ దిన పత్రికలు, వార్త, మాసపత్రికలు పాఠకుల కోసం సమకూరుస్తున్నారు. అయితే గ్రంథాలయంలో సౌకర్యాల లేమితో పాఠకులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతిరోజు ఈ గ్రంథాలయానికి సుమారు 300 వందల మందికి పైగా పాఠకులు వస్తుంటారు. అలాగే 900 వరకు సభ్యులుగా కొనసాగుతున్నారు. వేల పుస్తకాలు ఉన్నా గ్రంథాలయం అద్దె భవనంలో అది శిథిలావస్థకు చేరిన పెంకుటింట్లో నిర్వహించడంతో లోపల వెలుతురు సరిగా లేకపోవడం వంటి సమస్యలతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. చాలీచాలని గదులతో పాఠకులు ఆరుబయట, వరండాలలోను పుస్తక పఠనం చేయాల్సిన పరిస్థితి

సిబ్బంది కొరత

గ్రంథాలయం నిర్వహణకు సిబ్బంది కొరత వేదిస్తోంది. ముగ్గురు సిబ్బంది కావాల్సి ఉండగా కేవలం ఒక్క సబార్డినేట్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ గ్రంథాలయానికి అనుబంధంగా గేదిల్లంకలో గ్రామీణ గ్రంథాలయం, అన్నంపల్లి, చినకొత్తలంక, చిప్పల పాలెం, అనాతవరం, ఠానేల్లంక, క్రాపచింతలపూడిలోపాటు పలు గ్రామాలలో పుస్తక నిక్షిప్త కేంద్రాలు కొనసాగుతున్నాయి. తాళ్లరేవు, కాట్రేనికోన,ఐ.పోలవరం మండలాలలో గ్రామీణ గ్రంథాలయాలు అరకొర వసతులతో కొనసాగుతున్నాయి.

నిర్లక్ష్యం తగదు



పురాణాలు, సాహిత్యం వంటి అత్యంత ప్రాశస్త్యం కల్గిన పుస్తకాలకు నెలవైన గ్రంథాలయానికి భవనం లేకపోవడం బాధాకరం, విలువైన పుస్తకాలను పురాతన భవనంలో ఉంచడం శ్రేయస్కరం కాదు. పుస్తక బండారానికి పక్కా భవనం సమకూర్చడానికి స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు చొరవ తీసుకోవాలి.

– పి.శివనాగరాజు, కళాసాహితీ వ్యవస్థాపక అధ్యక్షులు, ముమ్మిడివరం

పక్కా భవనం కావాలి



విలువైన పురాతన పుస్తకాలు భద్రపర్చాల్సిన గ్రంథాలయాలనికి పక్కా భవనం నిర్మించాలి. అత్యంత విలువైన పుస్తకాలను కాపాడు కోవల్సిన బాధ్యత అందరిపై ఉంది. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– రేకాడి వర్మ, పాఠకుడు, ముమ్మిడివరం

మొదలైన పశు గణన



అమలాపురంలోని ఓ ఇంటి వద్ద పశు గణన చేస్తున్న ఎన్యుమరేటర్లు

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపాలిటీలోని 30 వార్డుల్లో పశుగణన ప్రక్రియ మంగళవారం మొదలైంది. ఈ పశు గణన కోసం పట్టణంలో నలుగురు ఎన్యుమేటర్లను నియమించినట్టు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి తెలిపారు. పట్టణంలో ప్రతి ఇంటికీ ఎన్యుమరేటర్ల వెళ్లి పశు గణన ప్రక్రియ చేపడతారన్నారు. దీని ద్వారా పట్టణంలోని ఆవులు, గేదెలు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, పందులు, పెంపుడు కుక్కలు, వీధి కుక్కల లెక్కలు తేలనున్నాయన్నారు. ప్రతి ఎన్యుమరేటర్‌కు పశు సంవర్ధక శాఖ నుంచి ఒక ఐడీ కార్డు ఇచ్చామని, వారు అడిగే ప్రశ్నలకు సమాధారం ఇచ్చి పట్టణ ప్రజలు సహకరించాలని విజయరెడ్డి విజ్ఞప్తి చేశారు.

కొనసాగిన వలంటీర్ల ధర్నా

తాళ్లరేవు: డిమాండ్ల పరిష్కారం కోరుతూ గ్రామ వలంటీర్లు చేపట్టిన ధర్నా కార్యక్రమం రెండో రోజైన మంగళవారం కూడా కొనసాగింది. గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ ధర్నా చేపట్టారు. ఆందోళనలో వలంటీర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

- మందులు బయటకు రాస్తున్నారేంటని ఆగ్రహం
- ఆంధ్రా వారికైనా ఉచిత మందులు ఇవ్వాల్సిందే...
- యానాం రోగులను కాకినాడ జీజీహెచ్‌కు పంపడం లేదా అని నిలదీత



జీజీహెచ్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని మంగళవారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఆకస్మిక తనిఖీ చేసి వైద్యాధికారుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న ఓ మహిళ తమకు వైద్యులు రాస్తున్న మందులు జీజీహెచ్‌లో ఇవ్వడం లేదని బయటకు రాస్తున్నారని దీంతో ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుక్కుంటున్నామని ఎమ్మెల్యే అశోక్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్‌ను ప్రశ్నించగా ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్న వారికి మందులు ఇవ్వడం కుదరదని సమాధానమిచ్చారు. దీనికి ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ యానాంకు చెందిన రోగులను ప్రతిరోజు అత్యవసర వైద్యానికి అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తున్నారని అయితే అక్కడ వైద్యులు యానాం వారికి వైద్యం చేయమని, మందులు ఇవ్వమని తిరస్కరిస్తే మన పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఆంధ్రా వారైనా మందులు ఇవ్వాలని స్పష్టం చేశారు. గడువు తేదీ ముగిసిన మందులను రోగులకు ఇస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. గర్భిణులను అర్ధరాత్రి సమయాల్లో కాకినాడకు రిఫర్ చేయడం, రాత్రి షిఫ్టుల్లో ఉండాల్సిన అంబులెన్స్ డ్రైవర్లు ఇళ్లలో ఉండటం, ఫోన్ చేసిన తాము నచ్చిన సమయానికి విధులకు హాజరవడం వంటి వాటిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని డీడీ రవిశంకర్‌ను ప్రశ్నించారు. కాలం చెల్లిన పాత ఎక్స్‌రే మెషీన్ స్థానంలో కొత్త డిజిటల్ ఎక్స్‌రే మెషీన్‌ను ఏర్పాటు చేయాలని దానికి సంబంధించిన నోట్ తనకు పంపితే అధికారులతో మాట్లాడి ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. ఐసీయూ విభాగం యూనిట్ పూర్తయినా ఎందుకు వినియోగించడం లేదని ప్రశ్నించారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు ఎందుకు ఇవ్వడం లేదని సొసైటీలో సుమారు రూ.70 లక్షలు ఉన్నప్పటికి వాటి వివరాలు ఎందుకు బయటపెట్టడం లేదని దీనిపై కోర్టుకు తాను వెళ్లి బాధితులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఆర్ఏవో మునిస్వామి, వైద్యులు పాల్గొన్నారు.

మీ జాగ్రత్తే ప్రయాణికుల భద్రత

- ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి
- పట్టణ సీఐ వీరబాబు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న పట్టణ సీఐ వీరబాబు, ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు

అమలాపురం టౌన్: ఆటో డ్రైవర్లు విధిగా వేగ నియంత్రణ పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు తరలించాలని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు సూచించారు. స్థానిక ఎర్రవంతెన వద్ద పట్టణ ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు అధ్యక్షతన ఆటో డ్రైవర్లతో మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో సీఐ వీరబాబు మాట్లాడారు. తరచూ సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాలు, అనివార్యమవుతున్న ట్రాఫిక్ అంతరాయం వంటి సమస్యలపై సీఐ వీరబాబు ఆటో డ్రైవర్లతో చర్చించారు. మీ జాగ్రత్తే ప్రయాణికుల భద్రత అని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆటో ప్రయాణం అంటే ప్రయాణికుల్లో ఓ భరోసా కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు ఆటో డ్రైవర్లకు సురక్షితమైన డ్రైవింగ్‌తో ప్రయాణికులకు భద్రత కల్పించే అంశాలపై అవగాహన కల్పించారు. స్థానిక నాయకుడు బొంతు బాలరాజు, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నాగ సాధన



నాగ సాధన చేస్తున్న అక్షయ పాత్ర సేవకులు

అమలాపురం టౌన్: శ్రీ గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ నగర్‌లోని ఆ సంస్థ కేంద్రమైన ఆదిశేష నిలయంలో నాగ పూజ, నాగ సాధన తదితర కార్యక్రమాలు మంగళవారం ఉదయం వైభవంగా జరిగాయి. ద్వాదశ దిశల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు 22 కిలోల బరువు ఉన్న వారాహి మహా కంద దీపాన్ని దర్శించి గోమ్రుతాన్ని సమర్పించారు. సాయంత్రం అక్షయ పాత్ర సేవకులు సామూహికంగా ఆది శేషునికి దీప యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో సేవకులు గొవ్వాల అచ్యుతరామయ్య, కుంపట్ల చంద్రావతి, లింగోలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలని ముస్లింల వినతి

అమలాపురం టౌన్: సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ముస్లింలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చన్నాయుడికి అమలాపురంలో వినతి పత్రం అందించారు. టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ మీరాన్ షరీఫ్ ఆధ్వర్యంలో సంక్షేమానికి పలు సూచనలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఎండీ బషీర్, ముస్లిం నాయకులు సర్కిల్ రాజా అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

230 మందికి కంటి పరీక్షలు



ఆపరేషన్లు చేయించుకున్న రోగులతో ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణ ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 230 మందికి వైద్య సేవలు అందించారు. అందులో 17 మందికి ఉచితంగా కాటరేక్ట్ ఆపరేషన్లు చేసేందుకు ఎంపిక చేశారు. వారికి ఆపరేషన్ చేయించి, వేమగిరి నుంచి ప్రత్యేక వాహనంలో అమలాపురానికి పట్టణ ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం తీసుకుని వచ్చారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆ రోగులకు మరిన్ని జాగ్రత్తలు చెప్పి వారి ఇళ్లకు పంపించారు. అసోసియేషన్ అధ్యక్షుడు యర్రమిల్లి విశ్వేశ్వరరావు, కార్యదర్శి అప్పన హరి శివప్రసాద్, కోశాధికారి నూలు సూర్య ప్రభాకరరావు, కో ఆర్డినేటర్ నంబూరి శ్రీనివాస్, ఆర్గనైజర్ నంబూరి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ నుంచి జారిపడి వ్యక్తి మృతి

యానాం: యానాం శివారు దరియాలతిప్ప సమీపంలో మంగళవారం ప్రయాణిస్తున్న ట్రాక్టర్ నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. స్థానిక అడివిపాలెంలో మూసివేసిన ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి చెత్తను ప్రతి రోజూ ట్రాక్టర్‌పై తీసుకువచ్చి బయట పారవేస్తుంటారు. మంగళవారం సాయంత్రం ట్రాక్టర్‌పై చెత్తను తీసుకువస్తుండగా డ్రైవర్ సీటు పక్కనే కూర్చున్న దరియాలతిప్ప గ్రామానికి చెందిన నందికి బాలకృష్ణ(55) దరియాలతిప్ప పాత అవుట్ పోస్టు వద్దకు జారిపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని బాలకృష్ణను యానాం జీజీహెచ్‌కు తరలించారు. మెరుగైన వైద్యం అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అక్కడ మృతిచెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

స్కూల్‌కు డిజిటల్ పరికరాల బహూకరణ



స్కూలులో డిజిటల్ క్లాస్ రూమ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్: స్థానిక జాయింట్ జాన్స్ హైస్కూల్‌కు సీఎస్ఆర్ యాక్టివిటీస్‌లో భాగంగా కెనరా బ్యాంక్ డిజిటల్ క్లాస్ రూమ్‌కు అవసరమైన పరికరాలను మంగళవారం బహూకరించింది. ఆ స్కూల్ పూర్వపు విద్యార్థి అయిన కెనరా బ్యాంక్ డివిజన్ మేనేజర్ ఉండ్రు అశోక్‌కుమార్ తాను చదువుకున్న స్కూలుకు డిజటల్ క్లాస్ రూమ్‌కు అవసరమయ్యే పరికరాలను సమకూర్చారు. ఈ క్లాస్ రూమ్‌ను ఉండ్రు వెంకటరత్నం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఉండ్రు ఆశీర్వాదం, మాజీ సర్పంచ్ ఉండ్రు సుదర్శనరావు, శ్యామలరావు, స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం షాపును తొలగించాలంటూ ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, ప్రజలు

అమలాపురం రూరల్: కామనగరువు బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన మారుతి మద్యం షాపును వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు, ఆమని ఆటోమొబైల్స్ కార్మికులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపును ఏర్పాటు చేశారని, దీనివల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక బైపాస్ రోడ్డు జంక్షన్‌లో మద్యం షాపు నెలకొల్పడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, మందుబాబుల వీరంగం వల్ల పాఠశాల, కళాశాల విద్యార్థులు హడలిపోతారని మాజీ సర్పంచ్ రాజులపూడి వెంకటేశ్వరరావు ధ్వజమెత్తారు. అందువల్ల బైపాస్ రోడ్డుకు ఆనుకుని ఏర్పాటు చేసిన మద్యం షాపును వేరే ప్రాంతానికి తరలించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు.

డిమాండ్ల పరిష్కారానికి వినతి



వైద్యురాలు ఇందిరాశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

ఐ.పోలవరం:ఐ.పోలవరం పీహెచ్‌సీ పరిధిలోని 104 సిబ్బందిని ఆదుకోవాలని, జీతాలు వెంటనే చెల్లించాలని కోరుతూ డ్రైవర్లు, సిబ్బంది నిరసన తెలిపారు. మంగళవారం ఐ.పోలవరం పీహెచ్‌సీ వైద్యురాలు టి.ఇందిరాశ్రీకి ఐ.పోలవరం మండలం డీఈఓ సీహెచ్‌బీవీ నారాయణ, డ్రైవర్ ఎం.అంకాలు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. అరబిందో యాజమాన్యం చెల్లించాల్సిన జీతాలు వెంటనే చెల్లించాలని, 104 సర్వీసులను గతంలో మాదిరిగా పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ యాజమాన్యం వాటా చెల్లించడంతో పాటు పలు డిమాండ్లతో వినతిపత్రాన్ని అందజేశారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఐ.పోలవరం: మండలంలోని గుత్తెనదీవి 33 కేవీ సబ్ స్టేషన్‌లో పరిధిలో కొత్త 11 కేవీ బ్రేకర్ పనులు నిర్వహిస్తున్న కారణంగా ఎదుర్లంక, పాత ఇంజరం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

భక్తి శ్రద్ధలతో నాగులచవితి

అమలాపురం టౌన్: నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలలోని మండలాల్లో వేకువజాము నుంచి తమ ప్రాంతాల శివార్లలో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. పుట్టలో పాలుతోపాటు తేగలు, తాటి గుంజు, చలివిడి, చిమ్మిలి వేశారు. పుట్టల వద్ద పూజలయ్యాక అక్కడే బాణసంచా కాల్చారు. ఎప్పుడూ జన సంచార లేక బిక్కు బిక్కుమంటూ ఉండే పట్టణ శివార్లలో ఉన్న పుట్టల వద్ద చవితి వేడుకల సందడి కనిపించింది. పట్టణంలోని కొంకాపల్లి, కంసాల కాలనీ, కల్వకొలను వీధి, చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం, దుడ్డివారి అగ్రహారం, సూర్యనగర్, విత్తనాల వారి కాలువగట్టు, నారాయణపేట, హౌసింగ్ బోర్డు కాలనీ, కార్మిక నగర్ తదితర ప్రాంతాల శివార్లలో ఉన్న పుట్టలకు భక్తులు పూజలు చేశారు. పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, ఎన్టీఆర్ మార్గ్‌లోని నాగ లింగేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు తరలి వెళ్లి దర్శనాలు చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ముమ్మిడివరం: నియోజకవర్గంలో నాగుల చవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకోన్నారు. ముమ్మిడివరం శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగుల చవితి పర్వదినం పురష్కరించుకుని శ్రీవల్లీ దేవ సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి బిల్వదళ సహిత లక్ష రుద్రార్చన, 108 లీటర్ల పాలాభిషేకం, 21 ద్రవ్యాల అభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ఉప్పలగుప్తం: మండలంలోని గ్రామాల్లో భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల వద్ద నాగేంద్రునికి నైవేద్యాలు సమర్పించారు.

యానాం: స్థానిక యానాం బైపాస్ సెంటర్ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద పుట్ట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్దనున్న పుట్ట వద్ద అధిక సంఖ్యలో మహిళలు తెల్లవారుజాము నుంచే పాలు పోసి తమ ఇష్టదైవాన్ని ప్రార్థించారు.

ఐ.పోలవరం: నాగుల చవితి పర్వదిన సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో నాగులచవితిని జరుపుకున్నారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు.

తాళ్లరేవు: చవితి పర్వదినాన్ని మండల ప్రజలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నా రు. పుట్టల్లో పాలు, కోడిగుడ్లు, చిమ్మీ, చలివిడి, వడపప్పు, తేగలు తదితర పదార్థాలను నాగేంద్రునికి నైవేద్యం సమర్పించారు. మండలంలోని తాళ్లరేవు, జార్జీపేట, సుంకరపాలెం, తదితర గ్రామా ల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

అమలాపురం రూరల్: బండారులంకలో ఉన్న భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి తదితరులు స్వామివారికి పూజలు చేశారు.



అమలాపురం కంసాల కాలనీలో పుట్ట వద్ద నాగుల చవితి పూజలు చేస్తున్న భక్తులు



పుట్ట దగ్గర పూజలు చేస్తున్న భక్తులు



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేస్తున్న పండితులు



గొల్లవిల్లిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పాములపుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



త్రయంబకేశ్వర స్వామివారికి అభిషేకాలు చేస్తున్న శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ శంకరమూర్తి

వృద్ధులకు రగ్గుల పంపిణీ

అమలాపురం రూరల్: ఇమ్మిడివరప్పాడులోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో వృద్ధులకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు తండ్రి వెర్రియ్య మూడోవర్ధంతి సందర్భంగా భోజనాలు, పండ్లు అందించారు. అనంతరంచలికాలంలో వృద్ధులకు ఉపయోగపడే విధంగా రగ్గులు పంపిణీ చేశారు. కాశి మురళీ కృష్ణ, పోతుమూడి రవికుమార్, ములపర్తి రామకృష్ణ, భూపతి దుర్గా ప్రసాద్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

డిమాండ్లు నెరవేర్చాలి

తాళ్లరేవు: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ 104 సిబ్బంది గాడిమొగ పీహెచ్‌సీ వైద్యాధికారి జయభార్గవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నాగార్జున, డీఈఓ రెడ్డి మాట్లాడుతూ గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలం రూ.50 వేల ఖర్చుతో నిర్వహించి ప్రజా ధనం వృథా కాకుండా చూడాలన్నారు. 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్, డీఈఓలకు జీఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరారు.